ఆర్‌ఆర్‌ఆర్
రెడ్యూస్ | రీసైకిల్ | రీయూజ్

పనికిరాని వస్తువులను బయట పడేస్తాం. చెత్త కుప్పల్లోకి విసిరేస్తాం. మన ఇంట్లో అడ్డు లేకుండా చూసుకుంటాం. ఇప్పటివరకు ఇదే జరిగింది. కానీ, ఇప్పుడు బయటకు విసిరేయాల్సిన అవసరం లేదు. పనికిరాని వస్తువులను తీసుకెళ్లి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో ఇస్తే చాలు. వాటిని అందమైన కళాకృతులుగా మార్చేస్తారు. అందరికీ ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తెస్తారు. అదెలా అంటారా.. ఇదిగో ఇలా..

వ్యర్థాలకు సరికొత్త అర్థం

- పనికిరాని వస్తువులతో చక్కని కళాకృతులు
- ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఏర్పాటుపై హర్షాతిరేకాలు

గాజువాక: సరిగ్గా ఉపయోగించే విధానం తెలియాలే గానీ ఈ సృష్టిలో పనికిరాని వస్తువే ఉండదంటారు. అది నిజమే అని నిరూపిస్తూ ఏర్పాటైంది రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్. వినూత్నంగా ఆలోచిస్తూ వ్యర్థాలకు అర్థం కల్పిస్తూ చక్కని కళాకృతులను తయారు చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ హిత వస్తువుల తయారీ.. వ్యర్థాల పునర్వినియోగం.. అలాగే మరికొంత మందికి ఉపాధి .. ఇలా బహుళ ప్రయోజనకారి అని ప్రశంసిస్తున్నారు.

'ప్లాస్టిక్'కు చెక్

ఈ కేంద్రాల్లో పాత వస్త్రాలను ఉపయోగించి గుడ్డ సంచులను తయారు చేస్తున్నారు. దీనికోసం ఎనిమిది కుట్టు మిషన్లు ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ చోట్ల లభించే పాత దుప్పట్లు, చీరలు, ఇతర వస్త్రాలను ఇక్కడికి తీసుకొచ్చి గుడ్డ సంచులను తయారు చేస్తున్నారు. ఈ సంచులను ప్రాచుర్యంలోకి తీసుకురావడం ద్వారా ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించాలన్న ఉద్దేశంతో జీవీఎంసీ ఈ సెంటర్లను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.


పాత టైర్లతో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ అలంకరణ


పునర్వినియోగానికి సిద్ధం చేసిన డ్రమ్ములు



గాజువాకలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్

నాణ్యతతో కూడిన బ్యాగులు



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో మేం నాణ్యత గల సంచులను తయారు చేస్తున్నాం. మాకు వచ్చిన పాత వస్త్రాలను తొలుత శుభ్రపరిచి, వివిధ రకాల బ్యాగులను తయారు చేస్తున్నాం. వాటిని జీవీఎంసీ యూసీడీ అధికారుల ద్వారా ప్రజలకు అందజేస్తున్నాం. ప్లాస్టిక్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యల్లో ఈ సెంటర్ చాలా బాగా దోహదం చేస్తుంది.
– ఎం.కరుణ, టైలర్, గాజువాక

వ్యర్థాల నుంచి రూపొందించిన వస్తువులు

- పనికిరాని డ్రమ్ములతో కుర్చీలను తయారు చేసి అందరూ కూర్చొనే విధంగా అందుబాటులోకి తెచ్చారు.
- పాతటైర్ల ముక్కలు, చెక్కలతో బల్లలను తయారు చేశారు.
- మరికొన్ని పాతటైర్లను ఉపయోగించి పూలకుండీలను తయారు చేశారు. అందులో మొక్కలను నాటారు.
- పనికిరాని వస్త్రాల నుంచి గుడ్డ సంచుల తయారీ

నిధులు రూ.20 లక్షలు


పాతటైర్లతో తయారు చేసిన బెంచీలు, కుర్చీలు


ఇది కదా అభివృద్ధి


పాత వస్త్రాలతో సంచులను కుడుతున్న మహిళలు

త్వరలో వివిధ రకాల ఉత్పత్తులు



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం చెత్త నిల్వ చేసే పాయింట్ కాదు. నివాసులకు పనికిరాని వస్తువులను సేకరించి వివిధ వస్తువులు, కళాకృతులను తయారు చేసే కేంద్రాలు. భవిష్యత్‌లో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా ప్రజలకు ఉపయోగపడే అనేక ఉత్పత్తులు తయారవుతాయి.
– డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, గాజువాక సహాయ ప్రజారోగ్యాధికారి

ప్రజలు స్వచ్ఛందంగా తెస్తున్నారు



ప్రజలు తమ ఇళ్లల్లో పనికిరాని వస్తువులను, పాత వస్త్రాలను స్వచ్ఛందంగా తెచ్చి ఇస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది కూడా వివిధ రకాల పాత వస్తువులను సేకరించి తెస్తున్నారు. వాటితో మేం రకరకాల వస్తువులను తయారు చేస్తున్నాం. ఈ సెంటర్‌లో కూర్చోవడానికి టేబుళ్లతో పాటు డెకరేషన్ వస్తువులను కూడా తయారు చేసి ఉపయోగిస్తున్నాం. దీనివల్ల రీసైక్లింగ్ జరిగి చెత్త తగ్గుతుంది.
– కె.అన్నపూర్ణ, టైలర్, గాజువాక

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా చందు


ఉరుకూటి చందు

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు) నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం ఆదేశాలను జారీ చేసింది. చందు రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆయన తండ్రి ఉరుకూటి అప్పారావు గతంలో కార్పొరేటర్‌గా పని చేశారు. ప్రస్తుతం మాడుగుల నియోజకవర్గం పరిశీలకుడిగా ఉన్నారు. తాత ఉరుకూటి చిట్టినాయుడు గాజువాక ప్రథమ సర్పంచ్‌గా పని చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే తన ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 73వ వార్డు వినాయకనగర్ వుడా కాలనీలో (వుడా ఓపెన్ ఆడిటోరియం వద్ద) రోడ్డు మరమ్మతు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.15.56 లక్షలతో పనులు చేపడుతున్నామని, త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సత్యంరెడ్డి, కుమార్, సీతయ్య, ఆలీ, కిరణ్, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నేడు

అగనంపూడి: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఈ నెల 13వ తేదీ ఉదయం పది గంటలకు అగనంపూడి ఆర్‌ఈసీఎస్ సెక్షన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్టు డీఈ రామకృష్ణ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ (ఆర్‌ఈసీఎస్) అగనంపూడి, లంకెలపాలెం పరిధిలో విద్యుత్‌పరమైన అపరిష్కృత, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన వేదికలో పాల్గొనాలని ఆయన కోరారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

అక్కిరెడ్డిపాలెం: పేద యువతి వివాహానికి ఆర్థిక సహకారం అందించారు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి. జీవీఎంసీ 69వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన పెట్లి నరిసమ్మ కుమార్తె వివాహం కోసం ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఆయన రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, అంబేడ్కర్ యువజన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

14న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ రాట

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెంలోని కోదండ రామాలయ ప్రాంగణంలోని శ్రీ వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 14న కల్యాణరాట మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అక్కిరెడ్డి శ్రీరాములు కుటుంబసభ్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం 8.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలియజేశారు. ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 18న సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

అవినీతి లేని పాలన కోసం జగన్ మళ్లీ రావాలి


70వ వార్డులో బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఉరుకూటి అప్పారావు

గాజువాక: రాష్ట్రంలో అవినీతి లేని పాలన అందించడం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డే మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు అన్నారు. 70వ వార్డు ఎల్వీనగర్ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.17,57,13,120లను ఖర్చు చేశారన్నారు. అనంతరం డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. నాయకులు కె.ఎస్.నాయుడు, భూషణం, రాజారావు, సీతిన అప్పారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


76వ వార్డులో డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు

76వ వార్డులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు వుడా కాలనీ సచివాలయం–4 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలో రూ.17కోట్ల24లక్షల 42 వేల 426తో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దొడ్డి రమణ, సీవో సూర్యనారాయణ, పరాంకుశం ప్రమీల, నరసింహమూర్తి, కొండయ్య పాల్గొన్నారు.

22ఏ జాబితా నుంచి తొలగింపునకు వినతి

గాజువాక: సిద్ధార్థనగర్‌ను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఆ కాలనీ సంఘం నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు సిద్ధార్థనగర్ మెయింటెనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. 2017 నుంచి తమ కాలనీని 22ఏ జాబితాలో ఉంచడంవల్ల అవసరాలకు తమ ఆస్తిపై ఎటువంటి రుణాలు పొందలేకపోతున్నామని, వారసులకు బదిలీ చేసుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు, మెయింటెనెన్స్ కమిటీ నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, జేఎస్ మూర్తి తదితరులున్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఓం నమశ్శివరుద్రాయ..

- పంచాక్షరితో ప్రతిధ్వనించిన శివాలయాలు
- భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు


షీలానగర్ శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


75వ వార్డు గౌరీపరమేశ్వర ఆలయంలో దీపారాధన


స్టీల్‌ప్లాంట్ శివాలయంలో మంచు శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా శివాలయాలు పంచాక్షరితో ప్రతిధ్వనించాయి. అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నసమారాధన నిర్వహించారు.

- 75వ వార్డు గౌరీ పరమేశ్వరాలయంలో అర్చనలు, సాయంత్రం దీపారాధన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గంట్యాడ గురుమూర్తి పాల్గొన్నారు.
- 76వ వార్డు బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో , హెచ్‌బీ కాలనీ వాసవీ పంచాయతన ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.
- వుడా కాలనీ, గాం. దీనగర్‌లోని శివాలయంలో పార్వతీపరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. సాయంత్రం శివలింగం, ఓం ఆకృతులతో దీపాలను వెలిగించారు.

షీలానగర్‌లో..

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, రామ్‌నగర్‌లలోని ఉమారామలింగేశ్వరాలయం, షీలానగర్‌లోని శివాలయాల్లో వేకువ జామునే భక్తులు దీపాలు వెలిగించారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంచుతో చేసిన శివలింగానికి విశేష పూజలు చేశారు. నిర్వాసిత గ్రామ మహిళలతో కోలాటాలు జరిగాయి. భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. అన్న సమారాధనలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

- రవీరేస్ బంక్ సమీప పాత కణితి శివాలయంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కణితి గ్రామ దేవత కమిటీ సభ్యులు హాజరయ్యారు.

నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సుబ్బారావు

అగనంపూడి: నిరుపేద బ్రాహ్మణులకు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ అండగా ఉంటుందని కార్పొరేషన్ డైరెక్టర్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. అగనంపూడిలో సోమవారం నిర్వహించిన శ్రీ శారదా గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘ సమావేశంలో ముందుగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబాలకు అపర కర్మలకు ప్రభుత్వం నుంచి స్థలం కేటాయించేలా పెద్దల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాల సుబ్బారావు, సంఘ ప్రతినిధులు నూకల సూర్య ప్రకాష్, ధర్మాల వ్యాసశర్మ, సుబ్రహ్మణ్యం, కుసుమ హరనాథ ఆశ్రమ నిర్వాహకులు దాదాజీ పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతే సేవ'


కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్‌ఎంఈ అధికారులు, వాసీవా, ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్‌ఎంఈ ఈఎఫ్‌వో విశాఖపట్నం ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆటోనగర్ ఈ – బ్లాక్‌లోని విశాఖ గ్రానైట్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అధికారులు, వాసీవా, ఆటోనగర్ ఐలా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ–బ్లాక్‌లో పలు చోట్ల మొక్కలు నాటి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అడ్మిన్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండు రంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యన్నారాయణ, లఘు ఉద్యోగభారత్ విశాఖపట్నం అధ్యక్షుడు అట్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టో అమలులో గుర్తింపు యూనియన్ విఫలం

అక్కిరెడ్డిపాలెం: భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన యునైటెడ్ ఫ్రంట్, ఏఐటీయూసీ 100 రోజుల్లో ఎన్నికల మ్యానిఫెస్టోను తుంగలోకి తొక్కిందని ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు అన్నారు. గుర్తింపు యూనియన్ వైఫల్యాలపై సోమవారం భెల్‌లో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బాబూరావు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం 18 పాయింట్లు అమలు చేయలేదన్నారు. అధ్యక్షుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ గుర్తింపు యూనియన్ 100 రోజులు గడిచినా మ్యానిఫెస్టోను పక్కన పెట్టి కేవలం మూమ్‌మెంట్ పాసులంటూ కాలాన్ని వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు సీతంనాయుడు, కె.విజయ్ కుమార్, ఎస్.జగన్నాధరావు, మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1033వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1033వ రోజుకు చేరుకున్నాయి. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలువురు కార్మికుల పాల్గొని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించండి

అల్లిపురం: బ్యాంకు రుణం తీసుకుని కొనుగోలు చేసిన ప్లాట్స్‌ను భారతి అనే మహిళ దౌర్జన్యంగా ఆక్రమించి, చంపుతానని బెదిరిస్తున్నారని గాజువాకకు చెందిన గోల్లి వెంకట నాగేషు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరంలో ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. తాను గతంలో బుద్ధ లేటు కృష్ణంనాయుడు కుమారుడు బుద్ధ అప్పారావు నుంచి రూ.కోటి 30 లక్షలతో మూడు ప్లాట్లు కొనుగోలు చేశానని, నగదు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు వివరించారు. ఈ మధ్యకాలంలో భారతి అనే మహిళ కబ్జా చేయడమే కాకుండా గాజువాక సీఐ భాస్కరరావు, గోవింద్ అనే కానిస్టేబుల్ అండ తమకు ఉందని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దాడి చేస్తామని బెదిరించారన్నారు. ఈ వివరాలతో నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. తనపైన, తన కుటుంబపైన దాడికి పాల్పడుతున్న వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు అభినందన


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం

కూర్మన్నపాలెం: ఎస్‌జీఎఫ్ ఏపీ జాతీయ స్థాయి అండర్–17 త్రోబాల్ పోటీలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సీహెచ్.సునీత, డి.చందన, ఎస్.సాయిలిఖిత, డి.మహేష్, వి.మనోజ్‌కుమార్, ఎన్.నూకరాజు, జె.వర్ధన్‌లను ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న నంద్యాలలో జరగనున్న పోటీల్లో పాఠశాల విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన పీడీ మన్నాజీ, పి.సూర్యనారాయణరావును ప్రశంసించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యపై నిరసన


ధర్నాలో ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని స్టీల్ ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలపై సోమవారం ఉదయం ఉక్కు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ నుంచి సెంట్రల్ స్టోర్స్ కూడలి వరకు మానవహారం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి మాట్లాడుతూ 4 నెలలుగా కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదని, దీంతో వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతీ నెల 7వ తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కిల్డ్ కార్మికులకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, కాంట్రాక్ట్ సంఘం నాయకులు రాజబాబు, నాగరాజు, మంగరాజు, నందికి తాతారావు, మురళీకృష్ణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం సేవలు ప్రశంసనీయం

గాజువాక: గాజువాక శిష్ట కరణ సంఘం అందిస్తున్న సేవలను ఆ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రశంసించారు. గాజువాకలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నాయకులు ఆదినారాయణ, మంత్రి శంకరనారాయణ తదితరులు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో సభ్యులకు సంబంధించిన అనేక సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఓబీసీ సాధనకు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, కూరాడ పావని, హరిబాబు, కె.గౌరీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

గాజువాక: విశాఖలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో బీబీఏ ఫస్టియర్ విద్యార్థి ఆర్‌వీఎస్‌కే మోహిత్ ప్రతిభ ప్రదర్శించాడు. కరాటే సీనియర్ +50 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని, 53 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుచుకోవడంతో పాటు ఓవరాల్ ట్రోఫీని కూడా సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. మోహిత్‌ను కళాశాల డైరెక్టర్ టి.బలరామకృష్ణ అభినందించారు.

'సర్వహిత' వితరణ

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని ఉక్కు సిటూ ప్రధాన కార్యదర్శి ఎస్.రామారావు అన్నారు. 85వ వార్డు పెదమడకలోని ట్రస్ట్ ఆధ్వర్యంలో 65 మంది నిరుపేదలకు రూ.200 చొప్పున పింఛన్, మృతి చెందిన ఇద్దరు పింఛన్‌దారుల కుటుంబాలకు చెరో రూ.2వేలు, ఒక నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, సరకులు అందించారు.వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, వ్యవస్థాపకుడు గుదే గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవ వనరుల అభివృద్ధిలో ఎన్‌ఐపీఎం కీలకం


ఎన్‌ఐపీఎం కౌన్సిల్ ప్రతినిధులతో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: మానవ వనరుల (హెచ్‌ఆర్) అభివృద్ధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం) కీలక పాత్ర పోషిస్తోందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే అన్నారు. ఎన్‌ఐపీఎం జాతీయ కౌన్సిల్ రెండు రోజుల సమావేశాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఐపీఎం వల్ల వృత్తి నైపుణ్యం పెరుగుతుందన్నారు. తరుచూ సెమినార్లు, సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా హెచ్‌ఆర్ మేనేజర్ల నైపుణ్యం మార్పిడి జరుగుతుందన్నారు. ఎన్‌ఐపీఎం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.హెచ్.రాజా మాట్లాడుతూ ఇటువంటి సమావేశాల ద్వారా హెచ్‌ఆర్ అంశాలు, పారిశ్రామిక సంబంధాలు, సవాళ్లపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ చాప్టర్ కార్యదర్శి బి.శేషగిరిరావు, జాతీయ కౌన్సిల్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.